క్లుప్తంగా

వీధి బాలలకు పండ్ల పంపిణీ



పండ్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కాశిబుగ్గ: వరంగల్ శివనగర్ డాన్‌బాస్కో నవ జీవన్ వీధి బాలల పాఠశాలలో జనయేత్రి ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండి.రహీంఖాన్ మాట్లాడుతూ ఫౌండేషన్ జాతీయ నాయకుడు ఎండి.మునీర్ అహ్మద్ షరీఫ్ జన్మదినం, గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని వీధి బాలలకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సందెల లాజర్, బల్లు శ్రీధర్, డాన్‌బాస్కో నిర్వాహకులు రాజు, దివ్య, ఉల్లాస, అనిత, భారతి, శారద తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి గజమాలతో అలంకరణ



కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి శుక్రవారం సహస్ర నామార్చన పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన గజమాలను స్వామివారి మూలవిరాట్‌కు వేసి అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో మహిళలు గణపతి సహస్ర పారాయణం చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో మహా అన్నదానం చేశారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూర్ణాహుతి

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీవిశ్వేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి నిర్వహించారు. చివరి ఘట్టమైన ఊంజల సేవ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ ఆకారపు హరీష్, స్వాతి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు లంకా శివకుమార్, అర్చకులు జగన్ మోహన్ శర్మ, కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ పోల శార్వాణి, భక్తులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్ అంబుజా ప్లేస్ సిమెంట్ తెలంగాణ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణప్రసాద్, శివకుమార్, వేణు, కార్తీక్, ఇంజనీర్లు, డీలర్లు, ముస్లింలు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన నాయకులు



ఖిలా వరంగల్: కరీంనగర్ జైలు నుంచి విడుదలైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌ను వరంగల్ శివనగర్‌కు చెందిన బీజేపీ నేత గంట రవికుమార్, పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, గోవింద్‌సింగ్, సతీష్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



హన్మకొండ చౌరస్తా: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని కూరపాటి ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని సూచించారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందని వివరించారు. డాక్టర్ కూరపాటి రాధిక మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు కీర్తిప్రియ, సుధాకర్, అవినాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళి పాపవిముక్తికి క్రీస్తు ప్రాణత్యాగం



వ్యాఖ్యోపదేశం చేస్తున్న కాసు మర్రెడ్డి



హసన్‌పర్తి: భీమారంలో శిలువయాత్ర



కాజీపేటలో శిలువ మోస్తున్న భక్తులు

కాజీపేట రూరల్: సర్వ మానవాళి పాపవిముక్తి కోసం ఏసుక్రీస్తు శిలువలో రక్తం చిందించి మరణించాడని ఫాతిమా కేథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు, పరిశుద్ధ సిలువ మార్గం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఏసుక్రీస్తు శిలువలో పలికిన పవిత్ర, శక్తివంతమైన 7మాటలను ఏడుగురు చర్చి సభ్యులు బైబిల్ పఠనం చేసి ప్రార్థనతో వాక్య వివరణ చేశారు. ఏసు క్రీస్తు శిలువలో మరణించిన తీరును ఫాదర్ కాసు మర్రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఫాతిమా చర్చి అధ్యక్ష కార్యదర్శులు బొక్క దయాసాగర్, టామి, ఆర్.రాజమోహన్ రావు, డాక్టర్ అరూరి రమేష్, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట శిలువ యాత్ర సాగింది. యేసును స్మరిస్తూ భక్తులు ముందుకు సాగారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు జక్కుల రజిత, గుగులోతు దివ్యారాణి, అరుణకుమారి, సిరంగి సునీల్‌కుమార్, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్ బాబు, కాంగ్రెస్ నాయకుడు చిన్న, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, జంగా కుమార్, మణీంధర్‌నాథ్, సముద్రాల మధు, శ్రీనివాస్, క్రిస్టియన్లు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. చర్చిల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. మానవాళి కోసం క్రీస్తు శిలువ నెక్కారని మత బోధకులు సందేశమిచ్చారు. క్రీస్తు అందరికోసం తిరిగి జన్మించారంటూ గీతాలను ఆలపించారు. సోమిడి, వెంకటాద్రినగర్, రహమత్‌నగర్, కాజీపేట, బాపూజీనగర్ కాలనీల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రాజీవ్ గృహకల్పలో శిలువ యాత్ర

కాజీపేట అర్బన్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో శుక్రవారం శిలువ యాత్ర నిర్వహించారు. కల్వరి ప్రేమ ప్రార్థన మందిరం సంఘ కాపరి రెవరెండ్ బొందుగుల కరుణాకర్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు పాటలు పాడుతూ సిలువ యాత్ర నిర్వహించి, ఏసు క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను తెలిపారు.



రాజీవ్‌గృహకల్ప సముదాయంలో శిలువ యాత్ర



ఫాతిమానగర్ చర్చి ప్రాంగణంలో..



హసన్‌పర్తి: దేవన్నపేటలో..

ఖాళీ స్థలం కనిపిస్తే చెత్త వేసినట్లే!

- కానరాని డంపర్ బిన్లు
- పేరుకుపోతున్న వ్యర్థాలు



కాజీపేట కూరగాయల మార్కెట్ ప్రధాన రహదారిపై వేసిన చెత్త

కాజీపేట: డంపర్ బిన్లు అందుబాటులో లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో, రోడ్లపై కొంతమంది చెత్తాచెదారం వేస్తున్నారు. దాంతో పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. కాజీపేట పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీల్లోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్తను జంతువులు, పందులు కదిలిస్తుండటంతో చెత్తంతా రోడ్లపైకి చేరుతోంది. మురుగు కాలువల్లో వ్యర్థాలను వేయడం వల్ల మురుగునీరు ముందుకు సాగడం లేదు. బహుళ అంతస్తుల భవనాలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, దుకాణాలు ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. కాజీపేట చౌరస్తా, ఫాతిమానగర్, జూబ్లీమార్కెట్, దర్గా కాజీపేట, రహమత్‌నగర్, సిద్ధార్థనగర్‌లలోని కాలనీల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. చెత్తను తొలగించడం ఒకటి, రెండు రోజులు ఆలస్యం అయితే వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోలాగా అవసరమైన స్థలాల్లో మున్సిపల్ అధికారులు డంపర్ బిన్లను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న గోవిందరాజుల రథయాత్ర



కళాకారులకు జాకెట్‌ముక్కలు, కండువాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గందె కల్పన

వరంగల్ చౌరస్తా: గోవిందరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం సుభాష్ విగ్రహం వద్ద ప్రారంభమైన రథయాత్ర.. రాధిక థియేటర్, ఎస్‌బీహెచ్ మీదుగా పిన్నావారి వీధి వరకు కొనసాగింది. ఈమేరకు యాత్రకు 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన స్వాగతం పలికారు. భక్తులు ఎదురేగి మంగళ హారతులు పట్టారు. రథయాత్రను తిలకించేందుకు స్థానికులు పోటీపడ్డారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, నవీన్‌కుమార్, ముదిరాజ్ వంశీయులు చింతాకుల సునీల్‌కుమార్, ఇప్ప ఆదినారాయణ, శ్రీనివాస్, సింగినేని శ్రీనివాస్, గోవిందు, రాధాకృష్ణ, నరహరి, వంశీ, సాగర్, ఈశ్వర్, శివ తదితరులు పాల్గొన్నారు.

శంభునిపేటలో మందుబాబుల హల్‌చల్

- శీతల పానీయాల దుకాణాల్లో మద్యం
- అర్ధరాత్రి వరకు గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- రోడ్లపైన బార్లను తలపించేలా మద్యం సీసాలతో సిట్టింగ్స్
- ఇదేంటని ప్రశ్నించిన వారిపై ఆకతాయిల తిరుగుబాటు
- క్షేత్రస్థాయిలో కానరాని అధికారుల తనిఖీలు



మద్యంబాబులు తాగి వదిలేసిన బీరు సీసాలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు, దూపకుంట రోడ్డులో రాత్రి ఏడు దాటగానే.. రోడ్లు కాస్తా బార్లుగా మారుతున్నాయి. అడ్డాకు మందుబాబులు చేరుకుని మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే సీసాలు ధ్వంసం చేసి ఇళ్ల మీదకు విసిరేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారులపై శీతల పానీయాల దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి 2గంటల వరకు యథేచ్ఛగా విక్రయాలు కొనసాగుతున్నాయి. మందుబాబులు తలకెక్కిన కిక్కులో కర్కశంగా వ్యవహరిస్తున్నారు. మైకంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మందుబాబుల ఇష్టారాజ్యం

గవిచర్ల క్రాస్‌రోడ్డులోని ఓ వైన్‌షాపులో మందుబాబులు మద్యం కొనుగోలు చేసి రోడ్డు మీద ఓ ఇంటి ముంగిట్లోనే కూర్చొని మద్యం సేవిస్తుండగా, కాలనీవాసులు వారిని నిలదీశారు. దాంతో తమ ఇళ్లపై ధ్వంసం చేసిన సీసాలు విసిరేశారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకతాయిలను కట్టడి చేయాలని పలుమార్లు విన్నవించినా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు తెలిపారు.

అడ్డుకునే వారేరి?

దూపకుంట రోడ్డుపై శీతల పానీయాల దుకాణాల్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వ చేసి జోరుగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇక్కడ అర్ధరాత్రి వరకు విక్రయాలు కొనసాగుతున్నాయి. అనధికార మద్యం విక్రయాలను అరికట్టడంలో పోలీసు, ఎక్సైజ్‌శాఖలు విఫలమయ్యారని విమర్శలొస్తున్నాయి. అతిగా మద్యం సేవించిన మందుబాబులు గొడవలకు తెగపడుతున్నారు. దాంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. అధికారులు స్పందించి గస్తీ పహారా ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: మద్యం అనుకొని ఫినాయిల్ తాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ డాక్టర్ కాలనీకి చెందిన షేక్ బియాబాని (55) శాకరాశికుంట సమీపంలోని రవికుమార్ పాత ఇనుప సామాన్ల షాపులో పనిచేస్తున్నాడు. ఈనెల 5న మధ్యాహ్నం ఖాళీ సీసాలో ఉన్న ఫినాయిల్‌ను మద్యం అనుకొని తాగాడు. వెంటనే స్పృహ కోల్పోగా అతనిని షాపు యజమాని ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం షేక్ బియాబాని మృతిచెందాడు. మృతుడి కుమారుడు షేక్ ఖలీల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

అతని కళ్లు సజీవం

కమలాపూర్ : మృతుడి కళ్లు మరో ఇద్దరికి చూపునిచ్చాయి. మండల కేంద్రానికి చెందిన చందనాల నారాయణ (97) అనారోగ్యంతో కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని కమలాపూర్‌కు తరలించగా అతడి కుటుంబ సభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో గురువారం నారాయణ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌కు పంపించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పల్, దేశరాజుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, నేరెళ్ల, శనిగరం, వంగపల్లి, మర్రిపల్లిగూడెం, గుండేడు, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి 22 మంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అవసరాలకు అనుగుణంగా పథకాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటా

ఆత్మకూరు : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పలువురు యాదవ సంఘం నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో ఆయన నివాసంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందని తెలిపారు. యాదవ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గొల్ల, కురుమల సంక్షేమానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వంగాల భగవాన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అంకూస్, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపని రవీందర్, కాడబోయిన మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో పొంచి ఉన్న ప్రమాదం!



కాజీపేటలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీ

కాజీపేట: కాజీపేట చౌరస్తా మీదుగా నిత్యం ఉదయం, రాత్రి వేళల్లో అనేక లారీలు ఊక (వరిపొట్టు) అధిక లోడుతో ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో ఇతర వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలు అతిక్రమించి లారీలు ప్రధాన రహదారిపై తిరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లారీలకు పరదాలు కట్టి ఓవర్‌లోడ్‌తో వరిపొట్టు రవాణా చేస్తున్నారు. దీంతో రోడ్డు మొత్తాన్ని లారీ ఆక్రమిస్తోంది. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చే వాహనలు ఓవర్‌టేక్ చేయాలన్నా సాధ్యం కావడం లేదు. అలాగే, ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని దుస్థితి నెలకొంది. ఇలాంటి లారీల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఇసుక లారీ బోల్తా..

- స్వల్పగాయాలతో బయటపడిన డ్రైవర్, క్లీనర్, ఇద్దరు కూలీలు



పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ఇసుక లారీ

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఓ ఇసుక లారీ వేగంగా వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడింది. దాంతో అందులోని ఇద్దరు కూలీలతోపాటు డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డారు. ఈఘటన శుక్రవారం తెల్లవారుజామున ఖిలా వరంగల్ మండలం మామునూరు గ్రామ చెరువు కట్ట వద్ద జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గోదావరి ఇసుకను డంపు చేయడానికి శుక్రవారం ఉదయం వరంగల్ నుంచి ఐనవోలు క్రాస్‌రోడ్డుకు ఇసుక లారీ బయల్దేరింది. ఈక్రమంలో మామునూరు చెరువు కట్ట వద్దకు ఇసుక లారీ చేరుకోగా మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోతూ అదుపుతప్పి పంటపొల్లాలోకి లారీ దూసుకెళ్లి బోల్తా పడింది. సంఘటన స్థలాన్ని మామునూరు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

అంతా డొల్ల

- నాసిరకంగా రోడ్డు నిర్మాణ పనులు
- నెలరోజులకే తేలిన కంకర
- కాంట్రాక్టర్, అధికారులపై ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆగ్రహం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనుల్లో పూర్తిగా నాణ్యతాప్రమాణాలు లోపించాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్, అధికారులను స్థానికులతో పాటు ఎమ్మెల్యే అరూరి రమేష్ మందలించినా వారి తీరు మారలేదు. ఇదీ హసన్‌పర్తి నుంచి జయగిరి, అన్నాసాగరం నుంచి చింతగట్టు వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనుల దుస్థితి.

కొరవడిన పర్యవేక్షణ

హసన్‌పర్తి మండలంలోని అన్నాసాగరం – చింతగట్టు, జయగిరి – హసన్‌పర్తి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు విడుదలయ్యాయి. పది కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన పనులు నెల రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. అయితే ఈ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో నిర్మాణంలో నాణ్యత లోపించిందని పలువురు వాపోతున్నారు.

ఎమ్మెల్యే ఆగ్రహం

నాసిరకంగా రోడ్డు నిర్మాణంపై వస్తున్న ఫిర్యాదులపై సదరు కాంట్రాక్టర్, అధికారులపై ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాలు వెళ్లే మార్గంలో తూతూమంత్రంగా రోడ్డు నిర్మాణం చేపడితే ఎలా అని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని హెచ్చరించారు.

నాణ్యత లోపించింది.



నిర్మించిన అనతి కాలంలోనే రోడ్డుపై కంకర తేలుతోంది. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి క్రమంలో నాణ్యతా ప్రమాణాలు పాటించపోవడంతో నెల రోజులకే రోడ్డు పాడయింది.

– కొంగటి శ్రవణ్, జయగిరి

నాణ్యమైన రోడ్డు స్థానంలో నాసిరకంగా పనులు



గతంలో నాణ్యమైన రోడ్డు ఉండగా దాన్ని తీసివేసి నాసిరకంగా పనులు చేపడుతున్నారు. వాహనాల రాకపోకలతో నూతన రోడ్డు దెబ్బతింటోంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు కూడా చేశాం.

– బొనగాని రమేష్, హసన్‌పర్తి







నెలరోజులకే ధ్వంసమైన రోడ్లు

సీకేఎంలో కానరాని నిర్వహణ

వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో నిర్వహణను గాలికొదిలేశారు. దాంతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తినిపారేసిన కంచాలు, విరిగిన మంచాలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్



హాస్పిటల్ ఆవరణలో పోగైన చెత్తకుప్ప



ఆవరణలో తినిపారేసిన విస్తార్లు, భోజనం



లీకైన సెప్టిక్ ట్యాంక్



ఆరుబయట ఉన్న విరిగిన మంచాలు



పెరిగిన పిచ్చి మొక్కలు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)